# మెన్ ప్రొటెక్షన్ సెల్

**కొ**న్ని అత్యవసరమైన పనులు పూర్తి చేయాల్సి ఉన్నందున ఉదయం ఆరుగంటలకే వచ్చి రాత్రి పదిగంటలదాకా వర్క్‌షాపులోనే ఉండిపోయాడు మంచివాళ్ళల్లో అతి మంచివాడైన శాంతకుమార్. పగలంతా ఒక్క నిమిషమైనా విశ్రాంతి తీసుకోలేదతడు. రిపేర్ పూర్తయిన రెండుకార్ల యజమానులూ వచ్చి సంతోషంగా వాటిని తీసికొనిపోయారు. రేపు ఉదయం వస్తాడే ఈ పిసినారి రామారావు రిపేర్ పూర్తయిన తన కారు కండిషన్ చూసి ఎంత ఆశ్చర్య పడిపోతాడో! సంతోషంతో గంతులే వేస్తాడేమో! మరే వర్క్‌షాపులోనూ ఆ డొక్కు కారు ఇంత శీఘ్రంగా బాగుపడి ఉండేది కాదు. కార్యసాధన కోసం అవసరమైతే గాడిద కాళ్లైనా పట్టుకోవటానికి వెనుకాడడు. పని పూర్తి చేయించుకొన్న తర్వాత, అంటే రిపేర్ బిల్లు చేతికందిన తర్వాత, తన పిసినారి తనాన్ని తేనెపూసిన నవ్వుతో కప్పుకొని, ''మనం చిరకాల మిత్రులం కదా! నా ప్రస్తుత పరిస్థితంతా నీకు తెల్సు. బిల్లు కొంచెం తగ్గించలేవా?'' అని దీనంగా అడుగుతాడు. దీనికి నా ప్రతిస్పందన ఎలా ఉంటుందో, ఎలా ఉండాలో ఇక్కడ వ్యక్తం చేయటం అంత భావ్యం కాదు.

రామారావు అన్న నామం ధరించినవాళ్ళల్లో ఎక్కువ శాతం ఇంత పిసినిగొట్టు వాళ్ళుగా మారిపోతున్నారెందుకో! ఈ పేరుగల మిత్రుడు విజయవాడలో నాకొకడున్నాడు. చక్కగా వ్యాపారం చేసుకొంటున్నా కనీసం ఇన్‌కంటాక్స్ కట్టటానిక్కూడా డబ్బులు లేవని వాపోతూ ఉంటాడు. అత్యవసరమైన ఖర్చులకు కూడా అతని జేబులో ఉండే చిల్లర సైతం నక్కుతూ నానుతూ బయటకొస్తుంది. కానీ తనకోసం ఎవరైనా డబ్బు ఖర్చు పెడ్తున్నప్పుడు గానీ, ఏదైనా వస్తువును ఉచితంగా ఇస్తున్నప్పుడు గాని అతని ముఖారవింద విలాసాన్ని వర్ణించతరమా?

నెల్లూరులో ఉండే మరో రామారావు కనీసం నెలకోసారైనా హైద్రాబాద్‌కు వస్తూంటాడు. ఉదయం వేళల్లో హైద్రాబాద్‌కు వచ్చే రైలు దిగి, స్టేషన్లోనే కాకిమునక స్నానం చేసి, సమీపంలో ఉండే ఓ మిత్రుడింటికి కాలి నడకన వెళ్ళి ఉపాహారం దట్టించేవాడు. స్నేహితుల వాహనాలతోనే పనులన్నీ పూర్తి చేసుకొని, రాత్రి భోజన భాజనాదులన్నీ మిత్రుల గృహాల్లోనే ముగించి, కానీ ఖర్చు లేకుండా తిరుగు ముఖం పట్టేవాడు. ఒకవేళ హైద్రాబాద్‌లో రెండుమూడు రోజులు ఆగవలసిన పరిస్థితే వస్తే, నా వద్దకుగానీ, లేదా నావంటి నోట్లో నాలుక లేని మరో సాధుస్వభావి ఇంటికిగాని వెళ్ళి, వారి ఆతిధ్య మర్యాదల గూర్చి అదే పనిగా పొగడటం మొదలు పెట్టేవాడు. హోటల్ భోజనం వల్ల వచ్చే అనర్థాలగూర్చి అనర్గళంగా ఉపన్యాసం దంచేవాడు. రెండు మూడు రోజులు ఆతిధ్య ఆశ్రయం పొంది వెళ్ళిపోతూ ''చూడమ్మా... చెల్లాయి... నెల్లూరు మొలకొలుకుల గూర్చిన ప్రసిద్ధి తెల్సుకదా! అవి ఎప్పుడు కావాలనిపించినా ఈ అన్నయ్యను అడగటానికి మొగమాట పడవద్దు; ఒక బస్తా బియ్యం లారీలో వేసి పంపుతాను...'' అంటూ మాటవరుసకు అనేవాడు. ఈ ఉట్టుట్టి ఒక బస్తా బియ్యానికి ఏ చెల్లాయి ఆశపడదని అతనికి బాగా తెల్సు.

అతనికున్నవి రెండే రెండు ప్యాంట్లు; ఒకటి బూడిద రంగుదైతే, రెండోది రాగి రంగుది. ఈ రెండు ప్యాంట్లు కన్నాడా ఉపయోగించేది ఒకే ఒక బెల్ట్; అదీ రాగి రంగుదే. ఇహ షర్టుల విషయానికొస్తే లేత తామ్రరంగుది ఒకటైతే, లేత నీలం రంగుది వేరొకటి. ఈ రెండూ అరచేతి చొక్కాలే. ఇవికాక వేరే బట్టలింకా ఏమైనా అతనికి ఉన్నాయేమో నాకుమాత్రం తెలియదు. ఈ రంగులు అతను ఎంపిక చేసుకోవటానికి తగ్గ కారణాలనుగూడా చెప్తాడు. దూరపు ప్రయాణాలు చేసే సందర్భాల్లో ధూళీగ్రటా పడి బట్టలు కొద్దిగా మాసినా ఈ రంగులో కన్పించవు. షర్టును ఎప్పుడూ మీరు ప్యాంట్ బయటే ఉంచుతారుగదా! మరి ఈ బెల్ట్‌ను ఎందుకు ఉపయోగిస్తారని ఎవరైనా ప్రశ్నిస్తే దానికి ఓ చక్కటి సమాధానం ఇస్తాడతడు...'' నేను ప్రయాణాలు ఎక్కువ చేసేవాణ్ణి కనుక ఈ బెల్ట్‌తో అవసరం నాకెంతో ఉంటుంది; బస్సులో, రైళ్ళల్లో ప్రయాణం చేసే సందర్భాల్లో వివిధ రీతుల్లో కూర్చోవాల్సి వస్తుంది. నిలబడి ఉన్నప్పుడు ప్యాంటుపైన ఎక్కువ వత్తిడి ఉండదు. కూర్చొని ఉన్నప్పుడు కడుపుభారం ప్యాంటుమీద ఎక్కువగా ఉండదు. పడుకొని ఉన్నప్పుడు ఏదో ఒకవైపు కడుపు వత్తిడే ప్యాంట్‌మీద పడుతుంది. ఇదిలా ఉంచి భోజనానికి ముందు పొట్ట పరిమాణం కొంచెం తగ్గి ఉంటే, భోజనానంతరం అది పెరుగుతుందిగదా! ఇలాంటి వివిధరకాల వత్తిడులను భరించే శక్తి పాపం ఈ ప్యాంటు గుండీలకు ఉండకపోవచ్చు. మధ్య దారిలో ఒక్క గుండీ పుటుక్కుమన్నా ఎంత ఇబ్బందికరమో మీకు తెలియంది కాదు గదా! అట్లా గుండీలు తెగిపోకుండా ఈ బెల్ట్ పెద్ద ఆసరాగా ఉంటుంది.''

ఇదంతా చూస్తుంటే, మనకు తెల్సిన ఆ తొలి రామారావు ఉన్నాడే, అదే అయోధ్య రామారావు, అతను గూడా ఇంతటి పిసినారా అన్న ఆలోచన కలిగి తీరుతుంది. పధ్నాలుగు సంవత్సరాలు వనవాసానికి వెళ్ళే సందర్భంలో అతడు భార్యను గూడా తీసుకు వెళ్ళటంలో ఏ తప్పులేదు. ఆ కాలంలో ఆ సీతారామారావుకు అంతకాలం, అంతదూరం భార్యను విడిచి ఉండటం సాధ్యం కాలేదేమో? తనంటే అంత భక్తి, గౌరవంగల లక్ష్మణున్ని గూడా పైసా ఖర్చు పెట్టనవసరం లేదు కదా అని, కేవలం సేవకునిగా, కాపలా వానిగా వినియోగించుకొన్నాడంటే ఆ అయోధ్య రామారావు ఎంతటి పిసినారి బుద్ధి కలవాడో అర్థంగావటం లేదా?

సీతారామ లక్ష్మణులు ఆహారాన్వేషణలో అరణ్యమంతా గాలిస్తున్న సందర్భంలో గొప్ప రామభక్తురాలైన శబరి కొన్ని పళ్ళు సమర్పించిన విషయం మీకు తెలియంది కాదు. ఆ కాలంలో వస్తువుల నాణ్యతా పరిరక్షణకు ఐ.యస్.ఐ. మార్కు గాని, అగ్ మార్కు గాని ఉండేవి కావు. ఈ లోటును భర్తీ చేయటానికే ఆ వృద్ధురాలు పండ్లను కొరికి, రుచి చూసి మరీ సీతారామారావుకు సమర్పించింది. రామానుజుడు రాముని చెవిలో గుసగుసలాడాడు. ''భ్రాతాశ్రీ... ఈమె పళ్ళు తోముకున్న లక్షణాలేమీ కన్పించటం లేదు. ఆమె ఎంగిలి చేసిన పండ్లను తినటం అసహ్యంగా లేదా?'' శ్రీరామారావు భావరహితమైన మందస్మితంతో ఇలా అన్నాడు: ''ఇంత మంచి పళ్ళు లభించాలంటే మనం ఎంత దూరం తిరగాలి. ఇవ్వన్నీ మనకు ఫ్రీగానే వస్తున్నాయి కదా! ఆమె కొరికిన భాగాన్ని కాక మరోవైపు పండును హాయిగా భుజించు. ఆ ఎంగిలి భాగాన్ని అవతల పారేయి. నేను చేస్తున్న పనిని నీవు గమనించటం లేదా? పాపం ఈ ముసలమ్మను నిరాశపర్చటం ఎందుకు?''

అయ్యయ్యో... పిసినారుల విషయం ప్రస్తావిస్తూ పరిశుద్ధుడైన ఆ శాంతకుమార్ విషయం మర్చిపోయామే; సారీ, పగలంతా పని చేయటమేగాక, రాత్రి పదిగంటలదాకా గూడా శ్రమించిన అతడు రెండుపూటలూ అసలు భోజనమే చేయలేదు. భోజనమే లేనప్పుడు పని చేయటానికి శక్తి ఎక్కణ్ణుంచి వస్తుంది? అందువల్ల శాంతకుమార్ అప్పుడప్పుడు ఒక కప్పు టీ సేవిస్తూ ఉంటాడు; ఎప్పుడో ఒకప్పుడు కొద్దిగా టిఫిన్గా తీసుకొంటాడేమో! సాటి పనివాళ్ళందరికీ అతను ఆరాధనీయుడు. ఏ వాహనాన్నీ అతను ముట్టుకొన్నా అది మృత సంజీవనిగా పనిచేస్తుంది. దాదాపు ఆరడుగుల ఎత్తు, అందుకు తగ్గలావు ఉన్న శాంతకుమార్ మంచి స్ఫురద్రూపి. పసిడి వన్నె శరీరానికి తోడు, ఉంగరాల ముంగురులు అతని అందంలోని ప్రత్యేకత. పౌరుషాన్ని ప్రతిబింబించే మీసాలు. కాలుతున్న సిగిరెట్ అతని పెదాలమధ్య ఎప్పుడూ కన్పించదు. మరి అక్కడ కన్పించేదేమిటి? అందర్ని

ఆకట్టుకునే ఒక మధుర మందహాసం మాత్రమే. ఆ ముఖాన్ని ఎల్లప్పుడూ అలంకరించి ఉండేది వినయమనే చందనమే. అతను ఎప్పుడూ ఎవరితోనైనా వాగ్వివాదం పెట్టుకొన్నట్లుగాని, అధిక ప్రసంగం చేసినట్లు గాని మనం ఎరుగం. తల్లిదండ్రులు అతనికి సార్థక నామధేయమే పెట్టారు.

ఆరోజు శాంతకుమార్ చేసిన అవిశ్రాంత పరిశ్రమతో వచ్చిన ఇంద్రజాలం వంటి ఫలితాలను చూసి నా మనసుకు అపురూపమైన చల్లదనం లభించింది. రాత్రి పదిగంటల తర్వాత ఇంటికి వెళ్ళటానికి అనుమతికోసం నావద్దకు వచ్చిన శాంతకుమార్‌ను మురిపెంగా చూశాను... ఎంతమంచి యువకుడు... కానీ, అతని చిరునవ్వు వెనక ఏదో విషాదం దాగి ఉందని నాకప్పుడప్పుడు అన్పిస్తుంది.

''థ్యాంక్యూ శాంతకుమార్... ఈరోజు నీవు చేసిన ఘనకార్యం ఎంతటిదో నీవు గ్రహించావో, లేదో! నీ కృషిని ఎంత పొగిడినా, ఎంత ఇచ్చినా అది నీ శ్రమకు తగ్గ ప్రతిఫలం కానేకాదు'' అని చెప్తూ ఒక వెయ్యి రూపాయలనోట్ల కట్టను అతని చేతిలో పెట్టాను. ఆ డబ్బు అతని చేతుల్లో ఉండగానే పాతగుడ్డలా కుర్చీలో కూలబడిపోయిన శాంతకుమార్ ముఖాన్ని రెండు చేతుల్లో కప్పుకొని వెక్కి వెక్కి ఏడవసాగాడు. నాకేం అర్థం కాలేదు. ఇంత డబ్బు లభించినందుకు అతను సంతోషించాలి గదా! ఒక పసిపిల్లవానిలా ఎందుకిట్లా ఏడుస్తున్నాడు? అతని భుజాన్ని తట్టి ఓదార్చాను నేను; క్షణమాగి ఎందుకు విలపించాడో కారణమడిగాను; తన దయనీయ గాథను అతడు ఇట్లా వివరించాడు.

ఆరు సంవత్సరాల క్రితం, అంటే శాంతకుమార్ ఇరవై ఆరుసంవత్సరాల వయస్సున్నప్పుడు వివాహం జరిగిందట. అతను కోరుకున్నందువల్ల కాదు ఆ వివాహం జరిగింది. శాంతకుమార్‌కు అయిదారు సంవత్సరాల వయస్సున్నప్పుడు అతని తండ్రి తల్లిని విడిచి వెళ్ళిపోయాడట. కానీ, ఇప్పటికీ తండ్రిని గూర్చిన భయంకర స్వప్నాలు అతనికి వస్తూనే ఉంటాయి. పక్కా తాగుబోతైన ఆ తండ్రి తల్లిని ఎప్పుడూ హింసిస్తూనే ఉండేవాడు. శాంతకుమార్‌ను గానీ, రెండు సంవత్సరాల చిన్నదైన చెల్లాయిని గానీ ఆ తండ్రి ఏనాడూ ఆప్యాయంగా ఎత్తుకొని ఎరుగడు. ఆ పసివయసులోనే అతని మనసులో రెండు విషయాలు నాటుకుపోయాయి; పురుషుడెప్పుడూ స్త్రీని హింసించగూడదన్నది ఒకటైతే, రెండోది మగవాడెప్పుడూ సౌమ్యుడుగానూ, క్షమాశీలుడుగానూ ఉండాలన్నది. దానికోసం ఎన్ని త్యాగాలను చేయటానికైనా అతను సంసిద్ధుడుగా ఉన్నాడు. పదో తరగతివరకూ ఎన్నో కష్టాలు పడి అతన్ని చదివించింది తల్లి. పై చదువులు చదవటం ఇహ సాధ్యం కాదని తెల్సుకొని శాంతకుమార్ మోటార్ మెకానిక్ షాపుల్లో పనిచేయటం

ప్రారంభించాడు. రూపవతి, గుణవతి అయిన చెల్లెలు సుకన్య మెట్రిక్‌లేషన్ పాస్ చేయించటానికి గూడా ఎన్నో కష్టాలను అనుభవించాడు.

ఉన్నంతలో ఉన్నతమైన సంబంధం తెచ్చి చెల్లాయికి వివాహం జరిపించాలన్నది అతని ఆశయం. అతని తల్లి ఎప్పుడూ మధన పడేది ఈవిషయం గూర్చే. తగిన కట్నం ఇవ్వకుండా ఆడపిల్లకు పెళ్ళిచేయటం అంత తేలికైన విషయం కాదని అతనికి తెల్సు. ఇరవైమూడు నిండినా ఆమెను పాణిగ్రహణం చేయటానికి ఒక్క యువకుడు గూడా ముందుకు రాలేదు. ఈ పరిస్థితులిట్లా ఉండగా...

శాంతకుమార్‌కు ఒక పెండ్లి సంబంధం వచ్చింది. ఆ అమ్మాయి పేరు సరళకుమారి. ఈపేరు తొలిసారి విన్నప్పుడే ఆ అమ్మాయిపట్ల ఒక ప్రేమ భావం ఏర్పడింది. శాంతకుమార్‌కు. ఆ అమ్మాయిని గాని, ఆమె ఫొటోనిగానీ చూడకుండా ఆమెపట్ల అంతగా ఎట్లా ఆకర్షింపబడ్డావని ఎవరైనా అతన్ని ప్రశ్నిస్తే, ఆ పేరుగల అమ్మాయి ఆకర్షణీయంగా ఉండకుండాఉండే అవకాశమే లేదని, ఒకవేళ ఉన్నా తనకెటువంటి అభ్యంతరం లేదని శాంతకుమార్ తెలియజేస్తాడు. అయితే సుకన్య వివాహం జరిగేంతవరకూ తన పెళ్లి ప్రసక్తే లేదని అతను చెప్పటం జరిగింది. సరళకుమారి తరపువాళ్ళకి ఇదొక సమస్యగానే అన్పించలేదు. కారణం శాంతకుమార్‌కు ఇద్దామనుకొనే కట్నం ఏభైవేలు ముందుగానే ఇవ్వటానికి వాళ్ళు సిద్ధంగా ఉన్నారు గనక. ఆ డబ్బుతో సుకన్య పెళ్ళి జరిపించటానికి తమకెట్టి అభ్యంతరం లేదని వాళ్ళు తెలుపటంతో శాంతకుమార్‌కు, తల్లికి అవధులు లేని ఆనందం కల్గింది. సుకన్య వివాహం ఘనంగా జరిగింది. ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న మార్కండేయుడనే యువకుడు వరుడు. అడ్వాన్సుగా వచ్చిన ఏభైవేలే గాక, అదనంగా మరొక ముప్పైవేలు గూడా చెల్లెలి వివాహం కోసం శాంతకుమార్ ఖర్చు చేశాడు.

ఆ అడ్వాన్స్ కట్నం పెళ్ళికూతురును మరింత వేచి ఉండేట్లు చేయకుండా శీఘ్రమే వివాహప్రాప్తి కలిగించాడు శాంతకుమార్. కన్య వెళ్ళి, కుమారి వచ్చినట్లుగా సుకన్య నిగమనం, సరళ ఆగమనం ఇంచుమించు ఒకేమారు జరిగినై. సరళ శాంతకుమార్‌కు ఎంతగానో నచ్చింది. ఆ అమ్మాయి తల్లికి పెద్ద వయసేమీ లేదు. ప్రస్తుతం పందొమ్మిది సంవత్సరాల వయసులో ఉన్న సరళ జన్మించే నాటికి ఆమె వయస్సు పదహారు. ఆమె పేరు చెప్పలేదుగదూ! సరోజని అని చెప్పుకొందామా? ఆమె ఏకైక పుత్రిక సరళ. అందుకనే సరళ వెళ్ళిపోవటంతో సరోజిని ఏకాకిని అయింది. ఆమె ఏకాకిని అయితే, సరళ తండ్రి ఏమైనట్లు? అతను ఒక ఆఫీసులో అటెండరగా పనిచేసే అది సాధారణుడు మాత్రమే. ఇంటర్మీడియేట్ వరకు చదివిన ఆమెకు ఎనిమిదో తరగతి మాత్రమే చదివిన బంట్రోతు

భర్తపట్ల ఏ గౌరవం ఉండేది కాదు. చౌకబారు రాజకీయ నాయకులమధ్య తిరిగే ఆమె తానొక ఎం.ఎల్.ఏనో, మంత్రినో కావాలని ఆశపడటంలో వింతే మున్నది? ఆమె హొయలు, ఒయ్యారాలు వాచాలత రాజకీయ జీవితానికి ఉపకరించే సాధనాలే. రాజకీయ రంగంలో ఆమె పురోగమనానికి నేల టికెట్ స్థాయి భర్త పేరే పెద్ద ఆటంకంగా ఉండేది. అతణ్ణి భర్త అని చెప్పుకోవటానికి గూడా ఆమెకు నామోషీగా ఉండేది. చిల్లర రాజకీయ నాయకుల మధ్య ఆమె సంచరించటం ఆమె భర్తకు గూడా ఇష్టముండేది కాదు. ఆ దంపతుల మధ్య దూరం పెరిగి పెరిగి న్యాయస్థానాల వరకూ పోకుండానే విడిపోయారు వాళ్ళు. బలవంతంగా గెంటివేయబడ్డ ఆ పతిదేవుడు తిరిగి ఎప్పుడూ భార్యనుగానీ, కుమార్తెను గానీ చూడలేదు.

అయిదో క్లాసువరకే చదివింది సరళ. పెళ్ళి తదనంతరం అత్తగారింటికి కూతురు వెళ్ళిపోవటంతో సరోజిని ఒంటరిదైపోయింది. ఒక విధంగా ఆ ఏకాంత జీవితం ఆమె పురోగమన కార్యకలాపాలకు దోహదం చేసేదే అయినా, కొన్ని ప్రశ్నలకు గూడా ఆస్కారమిచ్చింది. ఆ ఇంట్లో ఒంటరిగా ఉంటున్న ఆమె ఎంత కండపుష్టి గలదైనప్పటికీ, చుట్టుముట్టి తిరుగుతున్న కామేశ్వరరావులను, మన్మథరాయుళ్ళను, ప్రేమ పక్షీంద్రులను ఎల్లకాలం దూరంగా ఉంచటం ఆమెకు సాధ్యమయ్యే పనేనా? ప్రేమానురాగాలతో సమీపించే పురుషుణ్ణి తిరస్కరించటం ఏ స్త్రీకైనా సులభతరమా? ప్రేమమూర్తియైన శ్రీరాముని పాదస్పర్శ రాయిగా పడిఉన్న అహల్యను చైతన్యవంతురాలుగా చేయలేదా? తనలోని స్త్రీత్వాన్ని మేలుకొల్పిన పురుషుణ్ణి ఏ స్త్రీ గూడా తృణీకారభావంతో చూడదు అందరితో విచ్చలవిడిగా తిరుగుతుందన్నమాట వినటం ఆమెకెంతో కోపం కల్గిస్తుంది. మగ అండ లేని ఇంటిలో ఉండటం ఎంత దుర్భరమైన విషయమో ఆమెకప్పుడు తెల్సి వచ్చింది. సరళ ఉన్నప్పుడు ఆ చిన్నమాయి గూడా ఆమెకెంతో తోడుగా ఉండేది.

అందుకనే ఏవేవో కారణాలు చెప్పి సరళను ఇంటికి రప్పించుకొనే ప్రయత్నాలు చేసేది సరోజిని శాంతకుమార్ అందుకు అడ్డు చెప్పలేదు. పొద్దుపోయి వచ్చిన అతణ్ణి తన ఇంటివద్దనే ఉండిపొమ్మని కూతురుచేత చెప్పించేది. ఆరేడు నెలల గర్భం ఉన్నప్పుడు సరళ తల్లిగారి ఇంటివద్దనే ఉండిపోవటం జరిగింది. సాయంత్రం ఇంటికి వచ్చిన శాంతకుమార్ ఆమెకు పరిచర్య చేస్తూ సంతోషం పొందేవాడు. క్రమక్రమంగా ఆ ఇంటి పనులన్నింటిని గూడా శాంతకుమార్‌నెత్తినే అత్తగారు పెట్టటం జరిగింది. అయినాగాని శాంతకుమార్‌కు ఆపన్లు పెద్ద దుర్భరం అన్పించలేదు.

ఒకరోజు శాంతకుమార్ వర్క్‌షాపులో పనిచేస్తుండగా దారుణమైన వార్త వాయువేగంతో వచ్చి చేరింది. లారీ **ఒకటి** ఢీకొనటం మూలంగా మార్కండేయులు అక్కడికక్కడే మరణించాడని, ఆ లారీ ఆగకుండా వెళ్ళిపోయిందన్నదీ హృదయ ఛేదకమైన వార్త. తన తల్లికి ఈ విషయం చెప్పగూడదని భావించి, వంద కిలోమీటర్ల దూరంలో ఉన్న చెల్లాయి వద్దకు ఒక స్కూటర్‌మీద అతివేగంతో బయలుదేరాడు శాంతకుమార్. ఒక్క రోజులోనే పోస్టుమార్టం, శవదహనం అన్నీ జరిగిపోయాయి. రోగగ్రస్తురాలై ఒంటరిగా ఉన్న తల్లికి, తను అర్జెంటు పనిమీద ఎక్కడో ఆగిపోయినట్లూ, ఆందోళన ఏమీ పడవద్దనీ ఒక మిత్రునిద్వారా కబురు చేశాడు శాంతకుమార్. ఈ దుస్సంఘటనతోనే దహించుకుపోతున్న శాంతకుమార్‌కు, మండుతున్న అగ్నిలో ఆజ్యం పోసినట్లుగా భగ్గుమని కాలిపోయే మరో విషాదఘటన జరిగింది. కొడుకు చావుకు గుండె పగిలేలా ఏడ్చే మార్కండేయులు తల్లి, ఈ దుర్విధికంతా కోడలే కారణమంటూ ఆమెను తిట్టిపోసేది. ఇహ ఆ ఇంట్లో తన చెల్లాయికి ఆదరణీయమైన ఏ స్థానం ఉండదని శాంతకుమార్‌కు తెల్సిపోయింది. స్వాంతన పలుకులతో చెల్లాయిని ఓదార్చి, తల్లివద్దకు పరుగెత్తుకెళ్ళి పడతాడు. నెమ్మదినెమ్మదిగా శాంతకుమార్ ద్వారా వార్త విన్న ఆ దుర్భర రోగిష్టితల్లి బిగ్గరగా రోదించి, హిస్టీరికల్‌స్థితికి వెళ్ళి స్పృహను కోల్పోయింది.

రెండు మూడు రోజుల తర్వాత చెల్లెలు సుకన్యను తల్లివద్దకు తీసుకువచ్చాడు శాంతకుమార్. ఆమె తిరిగి భర్త ఇంటికివెళ్ళే అవకాశం లేదు. తండ్రిచేత పరిత్యక్తం చేయబడి వృద్ధురాలైన తల్లి, భర్తృ విహీనమైన చెల్లెలు వీళ్ళిద్దరి భారాన్నీ ఆజన్మాంతం మోయవలసిన పరిస్థితి ఏర్పడింది శాంతకుమార్‌కు.

ఇహ ఇక్కడనుండే అత్తగారి సహజ నైజం బయటపడి, భార్య గృహంలో ఒక యుద్ధకాండ ఆరంభమైంది. అల్లుడు మంచివాడేనన్న అభిప్రాయంసరోజినికి ఉన్నా, తాము ఇచ్చిన ఏభైవేలే గాక, మరో ముప్పైవేలుగూడా కలిపి చెల్లెలి వివాహం జరిపించిన తీరుమాత్రం ఆమెకు నచ్చిందికాదు. తన చెల్లెలు వివాహం విషయంలో వృధాగా అతను అంత డబ్బు ఖర్చు పెట్టటం ఆమెకెంతో అయిష్టతను, అసహనాన్ని కల్గించింది. అంత డబ్బు ఖర్చైనా వివాహానంతరం సుకన్య అత్తవారింటికివెళ్ళిపోవటం, వియ్యపురాలు గూడా ఇహ అట్టేకాలం జీవించి ఉండదనీ, తన కూతురు అల్లుడూ ఇద్దరూ జీవితాంతం తమ ఇంటివద్దనే ఉండిపోతారని సరోజిని ఆశించింది; ఆ ఘడియకోసం ఎదురు చూడసాగింది. మరణాన్నే జయించిన పురాణ ప్రసిద్ధుని పేరుపెట్టుకొన్నా, పది యమ వాహనాల్ని తనలో నింపుకొనే శక్తిగల లారీ తాకిడికి హతుడైన మార్కండేయుని సతి సుకన్య, నేడు సరోజిని

భవిష్యత్ పథకాలన్నీ ముక్కచెక్కలై పోవటంతో, ఎన్నికల్లో డిపాజిట్‌ను సైతం కోల్పోయిన అభ్యర్థిలా ఆమె నిరాశా నిస్పృహల్లో మునిగిపోయింది; దీనితో లోకమంటేనే ఆమెలో విరక్తిభావం ఏర్పడింది. పతిని కోల్పోయిన చెల్లెల్ని పుట్టింటికి శాంతకుమార్ తీసుకు రావటంతో సరోజిని హృదయం భగ్గుమంది. సరిగ్గా ఈ సమయంలోనే సరళ ఒక పాపను ప్రసవించటం జరిగింది. --- శిశువును చూడటానికి దురదృష్టవంతులైన శాంతకుమార్ తల్లీ, చెల్లెలు ఎట్టి పరిస్థితుల్లోనూ రాగూడదని సరోజిని కరాఖండిగా చెప్పటంతో అతని మనసు క్షోభించింది. సాటి స్త్రీలకు ఆపద సంభవిస్తే ఇంత నిర్దాక్షిణ్యంగా, నిర్మోహమాటంగా ఒక స్త్రీ మాట్లాడటం అతనికి ఆశ్చర్యాన్ని కల్గించింది. విధివైపరీత్యంవల్ల నరకతుల్యమైన వేదనను అనుభవిస్తున్న మానవులపట్ల, ఇంతటి క్రూరమైన దానవత్వాన్ని ప్రదర్శించటం ఒక మనిషికి సాధ్యమవుతుందని అతను ఏనాడూ అనుకోలేదు.

తమకు ఓ పాప జన్మించటంతో శాంతకుమార్‌కు పట్టరాని ఆనందం కల్గింది. ఆ పాపను ఒళ్ళోకి తీసుకొన్నప్పుడు అతను పరవశించి పోయేవాడు. అందువల్లనే పాప బట్టలుతకమని అత్తగారు తనతో అన్నప్పుడు ఆ విషయం అతనికేమీ అ సంగతంగా అన్పించలేదు.

ఈ పనులన్నీ చేయటానికి ఒక పనిమనిషిని పెట్టుకొనేంత ఆర్థిక స్తోమత అత్తగారికి లేదని అతను తలపోశాడు. రోజులు గడుస్తున్నకొద్దీ ఆ ఇంటి పనులన్నీ చేయటం అతనివంతే అయింది. అంటీ అంటనట్లుగా ఇంటిపనులు ఏనాడూ పట్టించుకోని సరోజిని, ప్రసవానంతరం తన కుమార్తె సరళ కుమారి ఏ పనీ చేయగూడదనే ఒక కొత్త నిబంధనను విధించింది. కేవలం స్త్రీలే చేసే కొన్ని పనుల్నిగూడా శాంతకుమార్ చేస్తుండటంతో సహకరించటానికి సరళకుమారి వస్తే, ఆ తల్లి రాక్షసి ఆమెను అడ్డగించేది. తన స్వంత ఇంటికిపోయి తల్లిని, చెల్లాయిని చూసిరావటానికి అతనికి అనుమతి లభించేది కాదు. ఈ కారణంగానే వర్క్‌షాప్ నుండే రహస్యంగా తన ఇంటికి పోయి వస్తుండేవాడు. అతనికిచ్చిన కట్నం డబ్బు గూర్చి రోజూ దెప్పిపొడిచేది సరోజిని. ఆ డబ్బే వడ్డీకి ఇచ్చి ఉంటే నెలకు కనీసం వెయ్యి రూపాయలైనా వచ్చి ఉండేవని గునుస్తూ ఉండేది. అన్నింటినీ సహిస్తూ, మౌనంగా ఉండేవాడతను. రాత్రీ పగలూ కష్టపడి పనిచేసేవాడు. అత్తగారికివ్వాల్సిన అధిక మొత్తంకోసం తల్లీ చెల్లాయిలు పస్తులుండకుండా చూడటానికి అవసరమయ్యే చిన్నమొత్తం కోసం అతను గానుగెద్దులా పనిచేయసాగాడు. ఇందుకోసం అతను రెండు మూడు వర్క్‌షాపుల్లో పని చేసేవాడు. క్రమేపీ అతని ఆరోగ్యంకూడా క్షీణించిపోయింది. అత్తగారి వాగ్దాటికి మాత్రం పదును పెరిగింది.

ఇటువంటి విషాద భారాన్ని మోస్తున్న పరిస్థితుల్లోనే ఒక ఎక్స్‌పర్ట్ మెకానిక్‌గా నాషాపుకు అప్పుడప్పుడు వస్తుండేవాడు శాంతకుమార్. పనిలో అతను చూపెట్టే శ్రద్ధ, నైపుణ్యం, ఆసక్తులేగాక, అతని ముఖంలో తొణికిసలాడే వినయంగూడా నన్నెంతగానో ఆకట్టుకొంది. నా వర్క్‌షాపులోనే శాశ్వతంగా ఉండిపోవాల్సిందిగా అతన్ని కోరాను. తనకు కావాల్సిన డబ్బు కోసమే రెండు మూడు షాపుల్లో పనిచేయాల్సి వస్తున్నదని అతను తెలియజేసినప్పుడు, ఆ డబ్బంతా నేనే ఇస్తాననీ, శాంతకుమార్‌కు చెప్పాను. నెలకు తానింత సంపాదిస్తున్నానని అతను నసుగుతూ వెల్లడించినప్పుడు, అంతకంటే అధికంగానే ఇస్తానని నేను సంతోషంతో తెలియజేశాను. దీనితో శాంతకుమార్ శాశ్వతంగా పనిచేయటానికి నా వద్దకే వచ్చాడు. యూనిఫారం పేరుతో మూడు జతల బట్టల్ని నానుండి స్వీకరిస్తున్నప్పుడు అతని కన్నులు చెమ్మగిల్లాయి. మామూలుగా బయట ధరించటానికి గూడా అతనికి మంచి బట్టలుండేవి కావు. ఈ కాలంలో ఒక జత ప్యాంటు, షర్టు కొనాలంటేనే మామూలు మనుషులకు సాధ్యం గావటం లేదు.

రోజూ పనికి వచ్చేటప్పుడు అతని ముఖం రాత్రంతా నిద్రపోనందువల్ల పీక్కుపోయినట్లుగానీ, లేక ఏడ్చి ఏడ్చి ఉబ్బిపోయిన విధంగా గానీ ఉండేది. పనిలో నిమగ్నమైన తర్వాత అతని ముఖభావంలో క్రమంగా మార్పు గోచరించేది. వాహనాల్లోని రుగ్మతల్ని నిర్ధారించటంలో నిపుణుడైన శాంతకుమార్, తన ఒక్కొక్క నిర్ధారణ సరైనదే అని తేలటంతో కలుగుతున్న ఆనందంతో అతని ముఖం వెలిగిపోయేది. ఇతర మెకానిక్‌లకు ఏమైనా సందేహాలొస్తే శాంతకుమార్‌నే అడిగి తెల్సుకొనేవారు. ఒక చిరునవ్వుతో వాళ్ళ సంశయాల్ని నివృత్తి చేసేవాడతడు. శాంతకుమార్ ఇచ్చే వివరణలతో వాళ్ళ సందేహాలు నివృత్తి అయిపోవటమేగాక, మోటార్ మెకానిక్ గూర్చిన మరెన్నో నిగూఢ విషయాలుగూడా వాళ్ళకు అవగాహనమయ్యేవి. శాంతకుమార్ ఎక్కడ పనిచేసినా ఆ వర్క్‌షాపు అనుకొన్న దానికన్నా మరెంతగానో అభివృద్ధి చెందుతుందన్న విశ్వాసం నాకేర్పడింది. అంతనైపుణ్యంగల మెకానిక్‌కు ఎంత జీతం ఇవ్వటానికైనా నేను సిద్ధంగానే ఉన్నాను. ఎప్పుడో తప్పని పరిస్థితుల్లో కొంత డబ్బు అడ్వాన్స్‌గా కావాలని అతనడిగేవాడు; అదీ మరీ మొహమాట పడిపోతూ; నెలాఖరున జీతం నేను ఇస్తున్నప్పుడు, అడ్వాన్సుగా అతను తీసికొన్న డబ్బును తిరిగి ఇవ్వబోయేవాడు. అలాంటి సందర్భాల్లో... ''ఫర్వాలేదు బాబూ... నేనిచ్చిన డబ్బు అప్పుగా చూడకు. అది నీకు న్యాయంగా రావాల్సిందే'' అని నేను అంటున్నప్పుడు, అతను పేలవంగా నవ్వుతూ ''సర్; ఇట్లా అయితే అవసరమైన పరిస్థితుల్లోగూడా మిమ్మల్ని డబ్బు అడగలేను'' అని సమాధానమిచ్చేవాడు.

కథా నిలయం
1575

''శాంతకుమార్... ఈ వర్క్‌షాపు నీదేనని నీవెందుకు అనుకోకూడదు. ఇంత కష్టపడి నీవు పనిచేస్తున్నప్పుడు నీకిందులో భాగం ఉండదా! నీవు మాత్రం నన్నొక పరాయి వాడిగా చూడకు. నేను నిన్ను నా స్వంత తమ్ముడిగానే భావిస్తున్నాను'' అని నేను చెప్తున్నప్పుడు అతని కన్నులు ధారాపాతంగా వర్షించేవి.

ఈరోజు వెయ్యి రూపాయలు ఇచ్చేటప్పుడు తూలి పడిపోయి వెక్కి వెక్కి ఏడవటానికి కారణమేమిటని అతన్ని అడిగినప్పుడు మరింత పెద్దగా ఏడుస్తూ చెప్పాడు. ''ఈరోజు నువ్వు వెయ్యి రూపాయలు తెచ్చి ఇవ్వకపోతే నిన్ను పోలీసుకు పట్టిస్తాను అని మా అత్త నన్ను గదమాయించింది''.

''పోలీసులకు పట్టివ్వటమేమిటి?'' అడిగాను నేను ఆశ్చర్యంగా.

''అధిక కట్నంకోసం నా భార్యను నేను కొడుతున్నాననీ, అడ్డమొచ్చిన అత్తగారిని గూడా దెబ్బలు కొట్టాననీ ఆరోపిస్తూ పిటిషన్ తయారు చేసి, దానిమీద నాభార్య సంతకం గూడా తీసికొని ఆమె తనవద్ద పెట్టుకొన్నది. అది పోలీసుల చేతుల్లోకి వెళ్తే నేను బెయిలుపైన రావటానికి గూడా వీలుండదు. ఇదేగాక, పోలీసుల్లోగూడా ఆమెకు మంచి పలుకుబడి ఉంది.''

''కానీ నీ భార్య సంతకం ఎలా పెట్టింది? నీవంటే ఆమెకు ఇష్టం లేదా?''

''నేనంటే ఆమెకు ప్రాణం; కానీ తల్లిని చూస్తేనే వణుకుతుంది. వయసు తగ్గ జ్ఞానం గూడా ఆమెకు లేదు.''

''అంటే ఎల్లకాలం అత్తగారికి భయపడుతూనే జీవించాలా నీవు?''

''సార్; ఆమె పిటిషన్ పోలీసుల కివ్వటమే మంచిది. ఎంత శ్రమించి పని చేసినా, ఎన్ని పైసలు సంపాదించినా నాకు మనశ్శాంతి లభించేదెప్పుడు? కనీసం జైలుకెళ్లినా అది దొరుకుతుందేమో. నేనేం పాపం చేసుకు పుట్టానో, నాకక్కడ గూడా ప్రశాంతత లభ్యంకాకపోవచ్చు. జైల్లో నాకు హాయిగా ఉంటే, నా రోగిష్టి తల్లి, చెల్లాయి ఇరువురూ ఎట్లా బ్రతుకుతారు?'' అంటూ అతను మళ్ళీ వెక్కి వెక్కి ఏడ్చాడు.

''బాధపడకు తమ్ముడూ; ఇప్పటికే చాలా ఆలస్యమైంది. ఈ సమస్యకు ఏదో పరిష్కారం ఆలోచిద్దాం. ప్రస్తుతానికి నీవు ఇంటికి వెళ్ళు'' అని చెప్తూ నేనతన్ని ఆలింగనం చేసుకొని ఓదార్పుగా వీపు తట్టి పంపించాను.

అతని ధర్మసంకటం గూర్చి నాకు ఎంతో బాధ కల్గింది. తల్లీ చెల్లాయి విషయం ఆలోచించినప్పుడు అతనికి జైల్లో గూడా ప్రశాంతత లభించదని చెప్తున్నది వాస్తవమే అయినా, కూతుర్ని విడిచి అతను క్షణమైనా దూరంగా ఉండలేడన్నది మరింత వాస్తవం.

కట్నంగూర్చి ఎందరో అభాగ్య యువతులు నిరంతర వేదనను అనుభవిస్తూ జీవిస్తున్నారు. భర్తల కిరాతకత్వానికి బలైపోతున్నారు. మరికొందరు అభాగినులు ఆత్మహత్యల ద్వారా బ్రతుకుల్ని ముగించుకుంటున్నారు. ఇంకొందరు భర్తల దుర్మార్గపు కారాగారంలో కాలి బూడిదై పోతున్నారు. ఇదేం విషాదం? ఇదేం క్రూరత్వం? ఇదేం పోయేకాలం? ఇందుకు ప్రతిగా మనిషిలోని అంతరాత్మ మేల్కోవాలి. ఈ రాక్షసత్వానికి, ఈ మృగతత్వానికి అంతం పలకాలి. ఈ విషయంలో విరుద్ధాభిప్రాయాలు వచ్చేవేవీ లేదు.

ఇందుకొఱకే కొత్త నియమాలు, చట్టాలు, ఉమెన్ ప్రొటెక్షన్ సెల్‌లు, స్త్రీ సేవా సంస్థలు రూపొందించబడ్డాయి. ఈ కాలంలో అభాగ్యులైన అబలలకు రక్షణ నివ్వటానికి ఎన్నో సంరక్షణ సదుపాయాలున్నాయి. కానీ ఆడవాళ్ళ క్రూరత్వానికిగురి అయ్యే పౌరుషహీనులైన పురుషులకు ఎవరు సహాయం అందిస్తారు? స్త్రీల చేత వల్లమాలిన బాధలనుభవిస్తున్నానని చెప్పుకోవటానికి ఏ మగవాడికైనా సిగ్గుగానే ఉంటుంది. సిగ్గు విడిచి ఇట్లా చెప్పినా ఎవరూ నమ్మకపోవచ్చు. పైపెచ్చు ఆ స్త్రీ బాధితుడు అపహాస్యం పాలైపోతాడు.

ఈ మధ్యనే ఒక దయనీయమైన కథను విన్నాను; కథ అంటే కేవలం కథ కాదు; వాస్తవంగా జరిగిన ఒక సంఘటనే. రామనాధన్ ఒక సాధు బ్రాహ్మణుడు. చాలాకాలంగా ఒక ప్రైవేటు కంపెనీలో ఒక మోస్తరు ఉద్యోగంలో చేస్తున్నా ఒక్కసారైన ఒక చీమనైనా నొప్పించని పరమ సాధువతడు. చూపులకు పెద్ద అందగాడు కాడు. పేషన్‌బుల్‌గా ఉండనే ఉండడు. అతని వయసిప్పుడు ఏభైఏడు సంవత్సరాలు. చూడటానికి ఒక మాదిరిగా ఉండీ, నవనాగరికంగా ఉన్నాననుకొనేఅతని భార్య పరిమళ వయస్సు ప్రస్తుతం ఏభై సంవత్సరాలు. వారిరువురి జాతకాల పొంతనకు ఏకైక దృష్టాంతమైన శర్మిల అనే కూతురు శ్రద్ధగా చదివి ఎం.బి.బి.యస్ పట్టాను పొందింది; సాంబారు పెరుగు అన్నాలు చక్కగా సమ్మిళితం అయినట్లు సౌమ్యత, సౌశీల్యతలు సంఘీభావం చెందిన ఒక వైష్ణవ బ్రాహ్మణ డాక్టరునుగూడా ఆమె పొందగలిగింది. అతనిపేరు అనంతకృష్ణన్ అని పెట్టినా కృష్ణునిలోని అనంతస్వభావ దోషాలేవీ అతనిలో లేవని అతని మిత్రులు చెప్తారు. ఒకే ముహూర్తంలో, ఒకే వేదికపైన శర్మిళ అనంతకృష్ణల వివాహం జరిగిందనే ఒకే కారణంతో ఆ ఇరువురో ఒకటిగా జీవించగలిగారు. కానీ కేవలం ఎం.బి.బి.యస్‌తో ఈ ఊరిలో ఉండి ఏం లాభం? ఆనాడెప్పుడో అమెరిగో వెస్ప్యూసి రాత్రింబవళ్ళు పడవ నడుపుకుంటూ కాలిడిన ఆ భూభాగానికి, నీటితో సంబంధం లేని ఆకాశమార్గాన చేరిపోయారు ఈ నవదంపతులు.

రామనాథన్, ఆయన ధర్మపత్ని పరిమళ కూతురు అల్లునికి వీడ్కోలు చెప్పటానికి బేగంపేట ఎయిర్‌పోర్ట్ వరకు మాత్రమే వెళ్ళారు. దీనికోసం బాంబేవరకు వెళ్ళి వచ్చేంతటి ఆర్థిక స్తోమత వారికి లేదు.

రామనాథన్ పరిమళల మధ్య పొడుచూపే అభిప్రాయ భేదాలు వాళ్ళ వివాహానంతరమే ప్రారంభమైనాయి. ఎందుకంటే పెళ్ళికిముందు వారిరువురికీ ఎటువంటి పరిచయం లేదు గాబట్టి. పెళ్ళిచూపుల నాటినుండీ రామనాథన్‌కు పరిమళ పట్ల ఇష్టమేర్పడింది. అదే సమయంనుండీ ఆ విప్రునితో పరిమళకూ - విప్రతిపత్తి ఏర్పడింది.'' నన్ను పెండ్లాటటానికి ఇతడే రావాలా? సాక్షాత్తూ ఆకుచేలుడే వచ్చి ఉంటే మరింత బాగుండేది?'' అనే నిస్పృహ భావం ఆమెలో ఏర్పడింది. ఎన్ని పెళ్ళి సంబంధాలు వచ్చినా అవ్వన్నీ నిష్ప్రయోజనం అయినందువల్లా, ఆమె వయసు గూడా ఇరవైనాలుగు దాటటంవల్లా, రాముడనిగాదు, కృష్ణుడనికాదు జందెం ధరించిన ఏ వ్యక్తినైనా వివాహమాడటానికి సిద్ధపడే స్థితికి వచ్చింది. అందుకే ఈ వివాహానికి అయిష్టతతోనే అంగీకరించింది. ఆమె కలల్లోని నాయకుని లక్షణాలేమిటంటే... పొగత్రాగాలి, విస్కీ త్రాగాలి, మోటర్‌సైకిళ్ళుగాని, స్కూటర్లుగాని అతివేగంగా నడపాలి, అప్పుడప్పుడు తనకు చికెన్ తినేటట్లుగా బలవంతపెట్టాలి, సినిమా స్టారులా ఉన్నావంటూ తనను పొగడాలి... అయితే రామనాథన్ అతిసాధారణ సాధు బ్రాహ్మణుడు కావటంవల్ల ప్రథమరాత్రి ఏర్పడ్డ తిరస్కారభావం ఆమెలో ఇప్పటికీ కొనసాగుతూ వస్తూ ఉంది. అది ఇప్పటికీ వృద్ధి చెందుతూనే వచ్చిందిగాని, తగ్గటానికి రామనాథన్ ఎటువంటి అవకాశం ఇవ్వలేదు. శర్మిలను ప్రసవించిన తర్వాత ఇతని అంశాన్ని ఇహ మోయటం తనవల్ల కాదనుకొంటూ ఆమె వెళ్ళి కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్స చేయించుకోవటం జరిగింది. ఈ విషయంలో భర్త అభిప్రాయాన్ని గూడా ఆమె తీసికోలేదు. ఆమె ఎంత అవమానకరంగా వ్యవహరించినా అతనికి మాత్రం ఆవేశం వచ్చేదికాదు. హిమాలయంలా అతనిది ఎటువంటి ఘర్షణకు తావీయని చల్లని స్వభావమే అయినా ఆమె మాత్రం అతనిపట్ల విద్వేష వైఖరినే ప్రదర్శించింది.

విమానాశ్రయం నుండి వెలుపలికి వచ్చిన పరిమళ భర్తతో ఒక పలుకైనా పలకకుండా ఆటోమీద వెళ్ళిపోయింది. బిత్తరపోయిన రామనాథం మరో ఆటో మీద ఇంటికి చేరాడు.

ఆరోజు సాయంత్రం వరకూ పరిమళ ఇంటికి రాలేదు. ఆమె గూర్చిన వివరాలు ఎవరిని అడగాలి, ఏమని అడగాలి అనే బాధతో అతనున్నాడు. సాయంత్రం అయిదున్నర గంటలై ఉంటుంది... ఒక కానిస్టేబుల్ వచ్చి ''ఇన్‌స్పెక్టర్ గారు మిమ్మల్ని పోలీస్ స్టేషన్‌కు తీసుకు రమ్మన్నారు'' అన్నాడు రామనాథన్‌తో. ఎన్నో భయాలతో, వణికే శరీరంతో కానిస్టేబుల్ వెనుక స్టేషన్‌కు వెళ్ళాడు. ఆ ఇన్‌స్పెక్టర్ చాలామంచివాడు; ''ఏం స్వామీ... ఇంకా మీ

వీర్యశక్తి తగ్గలేదా?'' అని నవ్వుతూ అడుగుతూ ఒక కాగితాన్ని రామనాథన్ చేతికిచ్చాడు. అది పరిమళచేతి వ్రాతతో ఉన్న ఒక పిటీషన్. గత ఇరవై ఆరు సంవత్సరాలనుండీ రామనాథన్ తనను శారీరకంగా, మానసికంగా ఎంతో బాధ పెడుతున్నాడనీ, ఇక కొద్దికాలం అతనితో సంసారం చేయటం జరిగితే తనను అంతమొందిస్తాడనీ, లేకపోతే తనకు ఆత్మహత్యే శరణ్యమవుతుందనీ, ఈ కారణం వల్లనే తాను స్వయంగా భర్త ఇల్లువదలి వచ్చిందనీ, రామనాథన్ వల్ల తనకు ప్రాణాపాయం జరగకుండా తనకు రక్షణ కల్పించాలనీ ఆ విజ్ఞాపన పత్రంలో ఆమె పేర్కొన్న సారాంశం. అది చదువుతున్నప్పుడు రామనాథం కన్నులనుండి వేడినీరు వర్షించింది. అతనిపట్ల జాలి చూపుతూ ఇన్స్పెక్టర్ ''స్వామీ ఏమిటిది... ఏడవకండి... నేను మీపైన కేసేమీ రిజిష్టర్ చేయటం లేదు. ఆమె మాటల్నిబట్టి, ముఖ భంగిమల్ని బట్టి అసలు రోగమేమిటో నాకర్థమైంది... ఆమెతోపాటు ఆమె బ్రహ్మచారి తమ్ముడుగూడా వచ్చాడు... ఇప్పట్నుంచి ఆమె అతనింట్లోనే ఉంటుందిట. మీరేం బాధపడకండి. కొంతకాలం మీరు ఒంటరిగా ఉండండి. ఆ బ్రహ్మచారి ఇంటి ఛాయలకుపోకండి. కొద్దికాలం తర్వాత ఆమే స్వయంగా మీవద్దకు వస్తుంది'' అని చెప్తూ రామనాథన్‌ను ఊరడించాడు.

ఇటువంటివి ఎన్నో సంఘటనలు మన సమాజంలో నిత్యం జరుగుతూనే ఉన్నాయి. మనుషులలో మంచివారూ, చెడ్డవారూ ఉంటారని చెప్తున్నప్పుడు అది స్త్రీలకైనా పురుషులకైనా సమానంగా వర్తిస్తుంది. మగవారంతా పాషాణ హృదయులేననీ, ఆడవాళ్ళందరికీ తీరని అన్యాయాలు జరుగుతున్నాయనే సిద్ధాంతంపైన ఒక చట్టం రూపొందించటం జరిగి, ఆ చట్టాన్ని కళ్ళు మూసుకొంటూ అమలు చేయటం జరిగితే, దీని ఫలితంగా ఎన్నో భయంకరమైన పరిణామాలు ఏర్పడుతాయి, భారతీయ సంస్కృతిలో స్త్రీకి ఎప్పుడూ గూడా ఒక ఉన్నతస్థానం ఉంది. భార్యని హింసిస్తున్నాడన్న ఆరోపణకు గురైన ఏ వ్యక్తైనా ఒక స్త్రీ సహాయం లేకుండా ఈ భూమిపై అవతరించాడా? ప్రతిస్త్రీ ఎవరో ఒకపురుషుడికి తల్లో, తోబుట్టువో, కూతురో అవుతుంది. అందుకే స్త్రీ పురుషులు భిన్నవర్గాలకు చెందినవారు గాక ఒకే వర్గానికి చెందినవారుగా భావించాలి.

వివాహం జరిగి ఏడు సంవత్సరాలు పూర్తిగాని భర్తలందరూ భార్యలపట్ల అణకువ కలిగి ఉండాలన్న భయాందోళనను కల్గించే చట్టముంది. దీనికొఱకు ప్రత్యేక పోలీసు విభాగముంది. ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ ఉంది. వాస్తవంగా సంభవించే విషయాలను పరిశీలించి మన శాంతకుమార్, రామనాథన్‌ల వంటి స్త్రీ బాధిత దయార్హులైన పురుషులకొరకు మెన్ ప్రొటెక్షన్ సెల్‌ను ఏర్పాటు చేసే అవసరం ఎంతైనా ఉంది.